# హండ్రెడ్‌లోకి సన్‌రైజర్స్ హైదరాబాద్



లండన్: ఇంగ్లండ్ టీ20 లీగ్ హండ్రెడ్ టోర్నీలో భారత ప్రముఖ కంపెనీల ప్రాతినిధ్యం అంతకంతకూ పెరుగుతూనే ఉన్నది. ఇప్పటికే లక్నో(మాంచెస్టర్ ఆర్జినల్స్, ముంబై(ఒవల్ ఇన్విన్సిబుల్) ఫ్రాంచైజీలు హండ్రెడ్‌లో పెట్టుబడులు పెట్టగా తాజాగా సన్‌గ్రూప్..హండ్రెడ్‌లో నార్తర్న్ సూపర్‌చార్జర్స్ జట్టును కొనుగోలు చేసింది. యార్క్‌షైర్ సీసీసీకి చెందిన నార్తర్న్ సూపర్‌చార్జర్స్‌లో పూర్తి వాటాను 1,092 కోట్లకు సన్‌గ్రూపు దక్కించుకుంది. ఇద్దరి మధ్య ఒప్పందాన్ని ఎనిమిది వారాల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుందని లీగ్ ప్రతినిధులు పేర్కొన్నారు. పురుషుల, మహిళల జట్లను కల్గి ఉన్న నార్తర్న్ చార్జర్స్ ఇప్పటి వరకు టైటిల్ గెలువలేకపోయింది. ఇప్పటికే ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో పాటు ఎస్‌ఏ టీ20లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ కల్గిన ఉన్న సన్‌గ్రూపునకు ఇది మూడో జట్టు కావడం విశేషం.

# ఆసీస్‌కు వరుస షాక్‌లు

**స్టోయినిస్ రిటైర్మెంట్ • గాయంతో కమిన్స్, హెజిల్‌వుడ్, మార్ష్ చాంపియన్స్ ట్రోఫీకి దూరం**



మెల్‌బోర్న్: ప్రతిష్ఠాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు వరుస ఎదురుదెబ్బలు తాకుతున్నాయి. ఆసీస్ సారథి పాట్ కమిన్స్, పేసర్ జోష్ హెజిల్‌వుడ్, మిచెల్ మార్ష్ వంటి కీలక ఆటగాళ్ల గాయాల బెడదకు తోడు గురువారం ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినిస్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్టు తెలపడంతో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) అభిమానులు ఉలిక్కిపడ్డారు. స్టోయినిస్ రిటైర్మెంట్ ప్రకటనతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఏదో జరుగుతోందనీ అనుమానాలు వ్యక్తమయ్యాయి. అంతర్జాతీయంగా వివిధ టీ20 లీగ్‌లలో ఆడుతున్న స్టోయినిస్.. ఇక నుంచి పూర్తిగా ఈ ఫార్మాట్‌పైనే దృష్టి సారించనున్నాడు. ఇక భారత్‌తో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో గాయపడ్డ హెజిల్‌వుడ్, కమిన్స్, మార్ష్ కూడా చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యారని ఆ జట్టు హెడ్‌కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ తెలిపాడు. చాంపియన్స్ ట్రోఫీకి కమిన్స్ దూరమైన నేపథ్యంలో స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్‌లలో ఒకరు ఆస్ట్రేలియాకు సారథిగా వ్యవహరించే అవకాశముంది.

# నెట్‌బాల్ తెలంగాణ కోచ్‌గా రాము



కల్వకుర్తి, ఫిబ్రవరి 6: డెహ్రాడూన్ వేదికగా జరుగుతున్న జాతీయ క్రీడల నెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ కోచ్‌గా మహబూబ్‌నగర్‌కు చెందిన రాము ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని జాతీయ నెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విక్రమ్ ఆదిత్యారెడ్డి గురువారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు రాము తెలంగాణ నెట్‌బాల్ టీమ్‌కు సేవలందిస్తాడని పేర్కొన్నారు. కోచ్‌గా ఎంపికైన రామును గ్రామస్తులు అభినందించారు.

# ఎస్‌డీఎఫ్‌సీ, కశ్మీర్ పోరు డ్రా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ(ఎస్‌డీఎఫ్‌సీ), రియల్ కశ్మీర్ జట్ల మధ్య గురువారం జరిగిన పోరు 1-1తో డ్రాగా ముగిసింది. శ్రీనిధి తరఫున డేవిడ్ కాస్టెండా(42ని) గోల్ చేయగా, కశ్మీర్‌కు పౌలో సెజార్(25ని) ఏకైక గోల్ అందించాడు. లీగ్‌లో శ్రీనిధి ప్రస్తుతం 16 పాయింట్లతో 8వ స్థానంలో కొనసాగుతున్నది.

## 8 నుంచి తెలంగాణ ఓపెన్ చెస్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బొడిగె బాలయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో తెలంగాణ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ జరుగనుంది. చర్లపల్లిలోని ఈసీ నగర్ కమ్యూనిటీ హాల్ వేదికగా పోటీలు నిర్వహిస్తున్నారు. మొత్తం అండర్-7, 9, 11, 13, 15 విభాగాల్లో జరుగనున్న టోర్నీ ప్రైజ్‌మనీ 60వేలుగా నిర్వాహకులు ప్రకటించారు. టోర్నీలోపోటీపడాలనుకునే వారు ఈ నంబర్లలో 7337578899, 7337399299 సంప్రదించవచ్చని తెలిపారు.

## కోహ్లీకి గాయం



నాగ్‌పూర్: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమ్ ఇండియాకు ఆందోళన కల్గించే వార్త. మోకాలి నొప్పితో ఇంగ్లండ్‌తో తొలి వన్డేకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దూరమయ్యాడు. మ్యాచ్ ముందు రోజు సుదీర్ఘంగా ప్రాక్టీస్ చేసిన కోహ్లీ గాయం బారిన పడ్డాడు. దీంతో తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. మోకాలుకు పట్టీతో కనిపించిన కోహ్లీ గాయం తీవ్రతపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. ఈనెల 9న కటక్‌లో జరిగే రెండో వన్డేలో ఆడుతాడా లేక..చికిత్స కోసం ఎన్‌సీఏ(బెంగళూరు)కు వెళ్తాడా అన్నది తేలాల్సి ఉంది.

## ఐసీసీ అవార్డు రేసులో త్రిష

దుబాయ్: ఇటీవలే మలేషియాలో ముగిసిన ఐసీసీ మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో టోర్నీ ఆసాంతం ఆల్‌రౌండ్ షోతో రాణించి భారత్ కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష.. ఐసీసీ మంత్లీ అవార్డుకు నామినేట్ అయింది. జనవరి నెలకు గాను ఐసీసీ ప్రకటించిన జాబితాలో త్రిష.. వెస్టిండీస్ బౌలర్ కరిష్మా, ఆసీస్ ఓపెనర్ బెత్ మూనీతో పాటు పోటీలో నిలిచింది. పురుషుల విభాగంలో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి నామినేట్ అయ్యాడు.

## లంక తడబాటు

గాలె: సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులోనూ శ్రీలంకను బ్యాటింగ్ కష్టాలు వెంటాడుతున్నాయి. గురువారం మొదలైన రెండో టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంకేయులు.. తొలి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 229/9 పరుగులు చేశారు. చండిమాల్ (74), కుశాల్ (59 నాటౌట్) రాణించారు. తన కెరీర్‌లో ఆఖరి టెస్టు ఆడుతున్న కరుణరత్నె (36) ఫర్వాలేదనిపించాడు. స్టార్క్ (3/37), లియాన్ (3/76) రాణించారు.

# గిల్ కమాల్

**అర్ధసెంచరీతో విజృంభణ • మెరిసిన హర్షిత్, జడ్డూ, అయ్యర్**

**తొలి వన్డేలో భారత్ అలవోక విజయం**



రాణా (3/53)



గిల్ (87)

అయ్యర్ (59)

**1** మూడు ఫార్మాట్లలో కలిసి అరంగేట్ర మ్యాచ్‌లలో 3 వికెట్లు తీసిన తొలి బౌలర్ హర్షిత్.

నాగ్‌పూర్: చాంపియన్స్ ట్రోఫీ సన్నాహకాల్లో ఉన్న భారత జట్టు ఆ దిశగా తొలి అడుగును విజయంతో ప్రారంభించింది. స్వదేశంలో ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ (వీసీఏ) వేదికగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 4 వికెట్ల తేడాతో గెలిచింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణించిన రోహిత్ సేన.. ఇంగ్లండ్ నిర్దేశించిన 249 పరుగుల ఛేదనను మరో 12 ఓవర్లు మిగిలుండగానే పూర్తిచేసి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఛేదనలో శుభ్‌మన్ గిల్ (96 బంతుల్లో 87, 14 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (36 బంతుల్లో 59, 9 ఫోర్లు, 2 సిక్సర్లు), అక్షర్ పటేల్ (47 బంతుల్లో 52, 6 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడటంతో టీమ్ ఇండియా అలవోక విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. 47.4 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌట్ అయింది. సారథి జోస్ బట్లర్ (67 బంతుల్లో 52, 4 ఫోర్లు), జాకబ్ బెతెల్ (64 బంతుల్లో 51, 3 ఫోర్లు, 1 సిక్స్), ఫిల్ సాల్ట్ (26 బంతుల్లో 43, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించారు. రవీంద్ర జడేజా (3/26) స్పిన్ మాయాజాలానికి తోడు అరంగేట్ర బౌలర్ హర్షిత్ రాణా (3/53) బట్లర్ సేనను కట్టడి చేశారు. గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

### అయ్యర్.. సూపర్

మోస్తరు ఛేదనలో భారత్‌కు మొదట్లోనే ఎదురుదెబ్బ తగిలింది. తొలి వన్డే ఆడుతున్న యశస్వీ జైస్వాల్ (15) మూడు బౌండరీలు కొట్టి జోరు మీద కనిపించినా ఆర్చర్ ఐదో ఓవర్లో మూడో బంతికి వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఏడాదికాలంగా పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న సారథి రోహిత్ (2)..మరోసారి నిరాశపరిచాడు. కానీ గిల్‌కు శ్రేయస్ జతకలవడంతో భారత ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. క్రమశిక్షణ కోల్పోయాడనే కారణంతో బీసీసీఐ ఆగ్రహానికి గురై సుమారు ఏడాదిన్నర విరామం తర్వాత జట్టులోకి వచ్చిన శ్రేయస్.. వన్డే ఫార్మాట్‌లో తాను ఎందుకంత కీలకమో మరోసారి ప్రపంచానికి చాటిచెప్పాడు. వన్డేలకు టీ20 తరహా బాదుడును జోడించిన అయ్యర్.. ఆర్చర్ 7వ ఓవర్లో చివరి రెండు బంతులను మిడ్‌వికెట్, థర్డ్‌మ్యాన్ దిశగా భారీ సిక్సర్లు బాదాడు. కార్స్ 10వ ఓవర్లో మూడు సార్లు బంతిని బౌండరీ లైన్ దాటించాడు. అయ్యర్ దూకుడుకు గిల్ నిలకడ తోడవడంతో స్కోరుబోర్డు వేగం పరుగులు పెట్టింది. శ్రేయస్ దూకుడుతో 30 బంతుల్లోనే అతడి అర్ధ శతకం పూర్తయింది. కానీ ఫిఫ్టీ అనంతరం బెతెల్ బౌలింగ్‌లో అతడు ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు.

### దూకుడుగా మొదలై..

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ ఆరంభ ఓవర్లలో దూకుడుగా ఆడింది. ఫిల్ సాల్ట్, బెన్ డకెట్ (29 బంతుల్లో 32, 6 ఫోర్లు) భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. హర్షిత్ రాణా వేసిన మొదటి ఓవర్‌లో రెండు ఫోర్లతో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన సాల్ట్.. అతడే వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో 6, 4, 6, 4, 6తో 26 పరుగులు పిండుకున్నాడు. డకెట్ సైతం బౌండరీలతో విరుచుకుపడ్డాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన హర్దిక్ ఆతిథ్య జట్టుకు తొలి బ్రేక్ ఇచ్చాడు. ఆ ఓవర్ ఐదో బంతిని బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా ఆడిన సాల్ట్.. మూడో పరుగు కోసం యత్నించాడు. కానీ శ్రేయస్ అయ్యర్ అద్భుత త్రో తో సాల్ట్ రనౌట్ అవడంతో 75 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

### రాణా, జడ్డూ కట్టడి

సాల్ట్ నిష్క్రమణ తర్వాత ఇంగ్లండ్ ఇన్నింగ్స్ గాడి తప్పింది. హర్షిత్ మూడు బంతుల వ్యవధిలో డకెట్‌తో పాటు ప్రమాదకర హ్యారీ బ్రూక్‌ను ఔట్ చేశాడు. జో రూట్ (19) జడేజా మాయ నుంచి తప్పించుకోలేకపోయాడు. ఈ క్రమంలో సారథి బట్లర్, ఆల్‌రౌండర్ బెతెల్ ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 59 పరుగులు జోడించారు. బట్లర్ 58 బంతుల్లో అర్ధశతకం పూర్తిచేశాక అక్షర్ బౌలింగ్‌లో హర్దిక్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. లివింగ్‌స్టన్ (5)ను రాణా ఔట్ చేయడంతో ఇంగ్లండ్ జట్టు కుదేలైంది. 42వ ఓవర్లో హాఫ్ సెంచరీ పూర్తిచేసిన బెతెల్‌ను జడేజా వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు.

### గిల్, అక్షర్ నిలకడ

శ్రేయస్ ఔట్ అయినా భారత్ దూకుడు తగ్గలేదు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన అక్షర్‌తో కలిసి గిల్ జట్టును విజయం దిశగా నడిపించాడు. ఈ ద్వయం రన్‌రేట్ 6కు తగ్గకుండా జాగ్రత్తపడ్డారు. 60 బంతుల్లో గిల్ అర్ధ శతకం పూర్తయింది. కార్స్ 29వ ఓవర్లో ఈ ద్వయం తలా రెండు ఫోర్లు కొట్టడంతో భారత స్కోరు 30 ఓవర్లకే 200 పరుగుల మార్కును దాటింది. 46 బంతుల్లో 50 రన్స్ చేసిన అక్షర్.. విజయానికి 28 పరుగుల దూరంలో నిష్క్రమించాడు. కేఎల్ రాహుల్ (2) విఫలమవగా శతకం దిశగా సాగిన గిల్ కూడా బట్లర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కానీ హార్దిక్ (9 నాటౌట్), జడేజా (12 నాటౌట్) లాంఛనాన్ని పూర్తిచేశారు.

### సంక్షిప్త స్కోర్లు

**ఇంగ్లండ్:** 47.4 ఓవర్లలో 248 ఆలౌట్ (బట్లర్ 52, బెతెల్ 51, జడేజా 3/26, రాణా 3/53; **భారత్:** 38.4 ఓవర్లలో 251/6 (గిల్ 87, శ్రేయస్ 59, రషీద్ 2/49, సకిబ్ 2/47)

# డంపింగ్ యార్డ్ ఆపేవరకు పోరాటం

- ఏకపక్షంగా వ్యవహరిస్తే ఊరుకోం
- ఎన్నికల కోడ్ అడ్డు రావడం లేదా?
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నిలదీత
- సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ఆందోళన



ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలంటూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

సంగారెడ్డి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం డంపింగ్ యార్డు పనులను నిలిపివేసే వరకు పోరాటం ఆగదని సమీప గ్రామాల ప్రజలు, బీఆర్‌ఎస్ నేతలు తేల్చిచెప్పారు. ప్రభుత్వం ఏకపక్షంగా డంపింగ్ యార్డు పనులు చేపడుతున్నదని మండిపడుతూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద గురువారం ఆందోళనలు కొనసాగించారు. ప్రభావిత గ్రామాల ప్రజలు, రైతులకు మద్దతుగా సంగారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. ఆందోళన అనంతరం సునీతారెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన సాగడంలేదని, ప్రజాకంటక పాలన సాగుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అటవీశాఖ అనుమతులు లేకుండా రోడ్డు నిర్మిస్తున్నదని, హైకోర్టు స్టేను లెక్కచేయకుండా డంపింగ్ యార్డు పనులు చేస్తున్నదని, ఎన్నికల కోడ్‌ను కూడా ఉల్లంఘిస్తున్నదని మండిపడ్డారు. ప్రశ్నించిన రైతులను అక్రమంగా అరెస్టు చేసి, బైండోవర్‌కు యత్నించడం దారుణమని ధ్వజమెత్తారు. డంపింగ్ యార్డుకు సమీపంలోని ప్యారాగనర్, నల్లవల్లి గ్రామాల పరిధిలో విధించిన 144 సెక్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. డంపింగ్‌యార్డుతో గద్దలు, కాకుల సంచారం పెరిగి సమీపంలోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ ట్రైనింగ్ అకాడమీకి చెందిన విమానాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని తెలిపారు. అకాడమీ అధికారులు కూడా స్పందించాలని కోరారు. ప్రభుత్వం డంపింగ్ యార్డు పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్‌ఎస్ నేతలు దేవేందర్, ఆదర్శ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశం, ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన

నర్సాపూర్, ఫిబ్రవరి 6: ప్యారానగర్ డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షనేతలు ధర్నా నిర్వహించారు. నేతల పిలుపుతో వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. అఖిలపక్ష నేతలు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు రాస్తారోకోలో పాల్గొనడంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళనలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో కురిసే నీరంతా నర్సాపూర్ రాయారావు చెరువులోకి చేరుతుందని, డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే చెరువు నీళ్లు పూర్తిగా కలుషితమవుతాయని తెలిపారు. రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఉద్యమంలో కలిసివచ్చిన బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులను అభినందించారు. డంపింగ్ యార్డు రద్దయ్యే వరకు ఇదే ఐక్యతతో ముందుకుసాగాలని, పోరాటంలో కాంగ్రెస్ నాయకులు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ధర్నాలో బీఆర్‌ఎస్ సీనియర్‌నేతలు సింగాయిపల్లి గోపి, సంతోష్‌రెడ్డి, సత్యంగౌడ్, అశోక్‌గౌడ్, నయీముద్దీన్, బీజేపీ నేతలు మల్లేశ్‌గౌడ్, సీపీఐ నాయకుడు ఖాలేఖ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ప్రభుత్వాన్ని నడపడం రావట్లే

- జనాభాను తక్కువ చేసి చూపడం దుర్మార్గమైన చర్య
- కులగణనపై ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నాం
- విచారణ జరిగితే రేవంత్‌రెడ్డి జైలుకు పోవాల్సి వస్తది
- స్థానిక పోరుకే కులగణన కుయుక్తులు: జీ జగదీశ్‌రెడ్డి



సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలన కుక్కలు చింపిన విస్తరిలా మారిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌కు ప్రభుత్వాన్ని నడపడం చేతకావడంలేదని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా మాజీ సీఎం కేసీఆర్ మీద ఏడుపు తగ్గడంలేదని మండిపడ్డారు. కేసీఆర్ చేపట్టిన సర్వే కరెక్ట్ అని, రేవంత్ సర్వే బోగస్ అని కాంగ్రెస్ నాయకులే చెప్తున్నారని తెలిపారు. సూర్యాపేటలో గురువారం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై విచారణ జరిపించాలన్న కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్‌అలీ వ్యాఖ్యలపై మండిపడ్డారు. సీబీఐతో కాదు సీఐఏతో కూడా చేసుకోవచ్చని తేల్చిచెప్పారు. విచారణ జరిగితే 16 లక్షల మంది జనాభాను లెక్కలోకి తీసుకోనందుకు రేవంత్‌రెడ్డి జైలుకు పోవాల్సి వస్తుందని తెలిపారు. సర్వేలో జనాభాను తగ్గించడం వల్ల ఎంపీ సీట్లు, కేంద్రం ఇచ్చే నిధుల్లో అన్యాయం జరుగుతుందని తెలిపారు. నాడు కేసీఆర్ సర్వే అంటే దేశవిదేశాల నుంచి జనం స్వచ్ఛందంగా తరలివచ్చారని, కాంగ్రెస్ సర్వే అంటే తరిమికొట్టారని కాంగ్రెస్ పెద్దలే సెలవిచ్చారని గుర్తుచేశారు.

### కేసీఆర్‌ను తిట్టకపోతే పూటగడవదా?

"కేసీఆర్‌ను తిడితేనే పూట గడుస్తుందని కాంగ్రెస్ నేతల నమ్మకం. రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం కేసీఆర్ మీద ఏడుస్తరు. కేసీఆర్‌ను మాయం చేసిన అని రేవంత్ అంటడు. రోజూ తిరుపతి వెంకన్నను తలిచినట్టు, రాములవారిని తల్చినట్టు, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని తలిచినట్టు రోజుకోసారి తలుస్తడు. ఒకడు కేసు పెట్టాలంటడు, ఒకడు అడికి, ఈడికి రావాలంటడు, ఏడికి ఏప్పుడు రావాలో కేసీఆర్‌కు తెలుసు. ఎప్పుడు రావాలని ప్రజలు కోరుకుంటున్నరో కూడా కేసీఆర్‌కు తెలుసు. రేవంత్, కాంగ్రెస్ నాయకులు చిల్లర వేషాలు మానుకోవాలి. కేసీఆర్‌ను తిడుతున్న సీఎం, మంత్రులు, నాయకులపై జనం కోపానికొస్తున్నరు. కేసీఆర్ మీదపడి ఏడుస్తరు.. మీకు బుద్ధి ఉందా? అని మండిపడుతున్నరు." అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.